క్లుప్తంగా

క్రీడల్లోనూ రాణించాలి



తేజస్వినికి క్రికెట్ కిట్ అందజేస్తున్న దృశ్యం

కదిరి టౌన్: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఫారెస్ట్ అధికారులు అండర్-15 జోన్ క్రికెట్ మ్యాచ్‌ల్లో అత్యధిక వికెట్లు తీసి ప్రభ కనబరచిన కదిరి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నరసింహమూర్తి కుమార్తె, సాధన స్కూల్ విద్యార్థిని అయిన తేజస్వినిని బుధవారం హరిత నేస్తం వ్యవస్థాపకుడు రాయసం హరిప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఫారెస్ట్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గుర్రప్ప మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం తేజస్వినికి క్రికెట్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రామచంద్ర నాయక్, సెక్షన్ ఆఫీసర్లు రామచంద్రారెడ్డి, దామోదర్, క్రికెట్ కోచ్ నజీర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, సిబ్బంది క్రీడాకారులు పాల్గొన్నారు.

15 రోజుల్లోగా పరిష్కారం

అమడగూరు: జాయింట్ ఎల్‌పీఎం సమస్యలపై బుధవారం ఈడిగవారిపల్లిలో గ్రామసభ నిర్వహించినట్లు తహసీల్దార్ రామనాథరెడ్డి పేర్కొన్నారు. రైతుల నుంచి అందిన అర్జీలను 15 రోజుల్లోగా పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం.. తీస్తుంది ప్రాణం



రైలు వచ్చినా ట్రాక్ సమీపంలో వెళుతున్న జనం

చెన్నేకొత్తపల్లి: రైలు వస్తున్నా నిర్లక్ష్యంగా రైల్వే ట్రాక్‌ను జనం దాటుతున్నారు. అనంతపురం, హిందూపురం ప్రధాన రహదారిలో ఎన్ఎస్ గేట్ సమీపంలో ఉన్న రైల్వే గేట్‌లో రోజూ వందలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. రైలు వచ్చే సమయంలో రైల్వే గేట్‌ను అక్కడి సిబ్బంది వేసినప్పటికి పలువురు నిర్లక్ష్యంగా రైల్వే గేట్‌ను దాటుతున్నారు. అక్కడి సిబ్బంది వారించినా వినకుండా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఏమాత్రం అశ్రద్ధ చేసినా ప్రమాదానికి గురికాక తప్పదు.

చిన్నారులకు టీకాలు

తాడిమర్రి: మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు. ఎంపీహెచ్ఈఓ నారాయణమ్మ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

నల్లమాడ: గోపేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం మహిళా కానిస్టేబుల్ నారాయణమ్మ తన తల్లి వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. నారాయణమ్మ కుటుంబ సభ్యులతో పాటు ఉపాధ్యాయులు చిట్టిబాయి, ఉషారాణి, వీరేంద్రబాబు, పద్మజ, షాజాద్ అలీఖాన్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



ఆస్పత్రిని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

అమడగూరు: వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్ఓ మంజువాణి ఆదేశించారు. బుధవారం ఆమె అమడగూరు ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, బయోమెట్రిక్ హాజరు పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలోని మందులను, స్టాకు రిజిస్టార్‌ను గమనించారు. రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్, వైద్యాధికారులు మోనా, అపర్ణ, సీహెచ్ఓ ఫక్రుద్దీన్, సిబ్బంది అపర్ణ, గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ధర్మవరం విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

ధర్మవరం అర్బన్: సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ధర్మవరం కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి శ్రీనివాసులు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 31 నుంచి తమిళనాడు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ప్రారంభమయ్యే సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎస్కేయూ జట్టు తరఫున శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆ పోటీల్లో కూడా రాణించాలని పీడీ ఆనంద్, అధ్యాపకులు ఆకాంక్షించారు.

దివ్య కాంతుల దీపావళి




విక్రయాలకు సిద్ధంగా ఉన్న టపాసులు



గాండ్లపెంటలో టపాసుల దుకాణాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారి

కదిరి టౌన్: చీకటిపై వెలుగు విజయమే దీపావళి. దుష్ట శక్తులను పారదోలి కొత్త జీవితానికి స్వాగతం పలికే వెలుగుల పండుగ దీపావళిని గురువారం జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో వస్త్రదుకాణాలు, పూలు, పూజా సామగ్రి, కిరాణా దుకాణాలతో పాటు టపాసుల విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి.

ప్రతి ఇంటా ఆనందాల దీపాలు వెలగాలి



మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: దీపావళి పండుగ ప్రజల జీవితాలలో కాంతులు నింపాలని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆకాంక్షించారు. చీకటి మీద వెలుగు, చెడుమీద మంచి, దుష్ట శక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి జరుపుకొంటారని పేర్కొన్నారు. ఈ పర్వదినం ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు సౌభాగ్యాలు, కలగాలని అభిలాషించారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి

కదిరి అర్బన్: హాస్టల్ విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కదిరి ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చరణ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్ల విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న 10 నెలల కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలన్నారు. హాస్టల్ వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కేజీబీవీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి



విజిటర్స్ బుక్‌లో సంతకం చేస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

నల్లమాడ: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సూచించారు. మంగళవారం జరిగిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వైద్యులు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. ఆస్పత్రి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ స్వర్ణలత

బత్తలపల్లి: ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురైతే పోలీసులను ఆశ్రయించాలని తహసీల్దార్ స్వర్ణలత, ఏఎస్ఐ తిరుపాలు సూచించారు. బుధవారం గుమ్మల్లకుంట ఎస్సీ కాలనీలోని ఆర్డీటీ కమ్యూనిటి హాలులో ప్రజల ప్రాథమిక హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికీ గ్రామాల్లో పెత్తందార్లు వెట్టి చాకిరీ చేయిస్తున్నా, దౌర్జన్యాలు చేస్తున్నా, బాలకార్మికులను వేధిస్తున్నా తమ దృష్టికి తేవాలని, అటువంటి వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు ఎస్సీ, ఎస్టీలను అడ్డంపెట్టుకొని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌ను దుర్వినియోగం చేస్తుంటారని, అలాంటి వారి మోసాలకు గురవ్వద్దని సూచించారు.

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని నాగసముద్రం గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. దళితవాడల్లోని ప్రజలు ఐకమత్యంతో ఉండాలని తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ శివశంకర్, ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అశోక్‌కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడే దీపావళి పండుగ

అమడగూరు: దీపావళి పండుగను గురువారమే జరుపుకోవాలని అర్చకుడు సుధీర్‌శర్మ స్పష్టం చేశారు. పండుగ గురువారమా లేక శుక్రవారమా అని చాలామంది అడుగుతున్నారన్నారు. గురువారం పండుగ జరుపుకోవడమే శ్రేయస్కరమని చెప్పారు. అలాగే నోముల పండుగను పురస్కరించుకుని ఉదయం 11 గంటల తర్వాత నోములు తీసుకురావాలన్నారు.

మహిళ ఆత్మహత్య



నూర్జహాన్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. టూటౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేతిరెడ్డి కాలనీకి చెందిన ఖాదర్‌బాషా మూడేళ్ల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి అతని భార్య షేక్ నూర్జహాన్ (38) కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులను పోషించుకుంటోంది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నూర్జహాన్ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. సమాచారం అందుకున్న సీఐ రెడ్డెప్ప సంఘటన స్థలాన్ని పరిశీలించి, ఆత్మహత్యకు గల కారణాల గురించి కుటుంబ సభ్యులతో అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పశు గణనకు సహకరించండి



పశుగణన పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీపీ

ముదిగుబ్బ: పశు గణన సమయంలో పెంపకందారులు వివరాలు తెలియజేసి సహకరించాలని ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ కోరారు. 21వ అఖిల భారత పశు గణన పోస్టర్లను బుధవారం ముదిగుబ్బ పశు వైద్యశాలలో ఎంపీపీ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు, కోళ్ల గణన టీకాలు, ఇతర పథకాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ముదిగుబ్బ పశువైద్యాధికారి డాక్టర్ రామేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రసాద్, పశువైద్య సిబ్బంది, బీజేపీ నాయకులు సూర్యనారాయణ, చిన్నరాములు, చంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్లకు దుస్తుల పంపిణీ



స్వీపర్లకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్, ఎంపీపీ

తలుపుల: దీపావళి పండుగ సందర్భంగా బుధవారం తలుపుల పంచాయతీలోని 23 మంది స్వీపర్లకు పంచాయతీ నిధులతో ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున దుస్తులను కొనుగోలు చేసి సర్పంచ్ శ్రీలత ఆధ్వర్యంలో ఎంపీపీ రఫీనాయక్, ఎంపీడీఓ రామానాయక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టోపీ రమణ, వార్డుమెంబర్ రమేష్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కదిరి టౌన్: పీఎం స్వానిధి పథకాన్ని 2023–2024 సంవత్సరంలో సమర్థవంతంగా అమలు చేసి అవార్డు అందుకున్న కదిరి మున్సిపల్ కమిషనర్ కె.కిరణ్‌కుమార్‌ను బుధవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సి.వి.క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



అవార్డు అందుకుంటున్న కరుణాకర్‌రెడ్డి

ఓడీచెరువు: గ్రామీణ ప్రాంతాల్లోని పోస్టల్ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని హిందూపురం పోస్టల్ ఎస్పీ విజయకుమార్ సూచించారు. పోస్టల్ బీమా డిపాజిట్ల సేకరణలో ప్రతిభ కనబరచిన ప్రథమస్థానంలో నిలిచిన డబురువారిపల్లి బీపీఎం కరుణాకర్‌రెడ్డిని అభినందిస్తూ జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని ఆయన బుధవారం అందజేశారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థిని

ధర్మవరం: పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే ఉత్సాహంగా నిర్వహించారు. జూనియర్ విద్యార్థులకు సీనియర్లు ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రిన్సిపాళ్లు ముసలిరెడ్డి, ప్రిన్సిపాల్ పుష్పవాహనరెడ్డి, అధ్యాపకులు హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం సినీ పాటలకు విద్యార్థులు వేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి.

దివ్యాంగుడి కుటుంబానికి సరుకుల అందజేత



ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న దివ్యాంగుడు షాకీర్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణాపురం షాహిన్‌షా అహ్మద్ బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు. దివ్యాంగుడి ఇబ్బంది గురించి పదో వార్డు ఇన్‌చార్జ్ కృష్ణాపురం జమీర్ అహ్మద్ తనకు తెలియజేయడంతో తనవంతు సాయమందించానన్నారు.

108 వాహనాన్ని పునరుద్ధరించండి



వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ముదిగుబ్బ: అతిపెద్ద మండలమైన ముదిగుబ్బలో 108 వాహన సేవలను పునరుద్ధరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. వాహనం మరమ్మతుల కారణంగా 20 రోజులుగా అందుబాటులో లేదన్నారు. దీంతో అత్యవసర సమయంలో గర్భిణులు, ప్రమాదాలబారిన పడిన వారు, పాము కాటు బాధితులు తదితరులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రిపేరీ చేసి 108 వాహనాన్ని అందుబాటులోకి తేవాలని సీపీఎం నాయకులు ఆటో పెద్దన్న, బండల వెంకటేష్ తదితరులు వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు.

అందుబాటులో ఉండండి

తలుపుల: వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని డీఎంహెచ్ఓ మంజువాణి సూచించారు. తలుపుల ప్రభుత్వ వైద్యశాలను బుధవారం డిప్యూటీ వైద్యాధికారి నాగేంద్రనాయక్‌తో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారులు అష్ఫాఫ్, అశ్రీతతో వారు వైద్య సేవలపై ఆరా తీశారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: సైబర్ నేరాల వలలో చిక్కుకోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ రత్న వదాన్య సొసైటీ సభ్యులకు సూచించారు. వదాన్య సొసైటీ ధ్వర్యంలో నిర్వహించే టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఎస్పీ విడుదల చేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు ఎస్పీతో మాట్లాడుతూ గత 13 సంవత్సరాల నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేద ప్రతిభావంతమైన విద్యార్థుల అభ్యున్నతి కోసం విశిష్ట సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఏటా 4,500 మంది విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించి, అందులో ఎంపికైన వారికి బహుమతులు అందజేసి ఆర్థిక తోడ్పాటునందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా డిసెంబర్‌లో కొత్తచెరువులో డీఎస్సీ ఎస్టీటీ మెగా గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జనవరి నెలలో బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ వదాన్య సొసైటీ సేవలను అభినందించారు.

అనుమతిలేకుండా విక్రయిస్తే చర్యలు



టపాసుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ



ఓడీచెరువులో సూచనలిస్తున్న ఎస్ఐ

అమడగూరు: అనుమతి లేకుండా టపాసులు విక్రయించినా, నిల్వ ఉంచుకున్నా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వెంకటనారాయణ హెచ్చరించారు. బుధవారం ఆయన అమడగూరులో గ్రామస్తులతో సమావేశమయ్యారు. లైసెన్స్ పొందిన వారు మాత్రమే టపాసులు విక్రయించాలన్నారు. లైసెన్స్ పొందిన వారు కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయ కేంద్రాల వద్ద నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పండుగ రోజు ఇళ్ల వద్ద పిల్లలు టపాసులు పేల్చే సమయంలో తల్లిదండ్రులు పక్కనే ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించండి

గాండ్లపెంట: భద్రతా ప్రమాణాలు పాటిస్తూ టపాసులు విక్రయించాలని తహసీల్దార్ బాబురావు ఆదేశించారు. బుధవారం గాండ్లపెంటలోని ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన మూడు టపాసు దుకాణాలను, నిర్వాహకుల లైసెన్సులను తహసీల్దార్ తనిఖీ చేశారు. నిబంధనలు పాటించాలని సూచించారు.

ఓడీచెరువు: అనుమతులు లేకుండా మండలంలో ఎక్కడైనా టపాసులు నిల్వ ఉంచినా, క్రయవిక్రయాలు జరిపినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. ఓడీచెరువులో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు.

టపాసుల దుకాణాల తనిఖీ

చెన్నేకొత్తపల్లి: దీపావళి పండుగను పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను రామగిరి సీఐ శ్రీధర్, చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ బుధవారం తనిఖీ చేశారు. దుకాణాల సమీపంలో డ్రమ్ముల్లో నీరు, ఇసుకను తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు. పరిసర ప్రాంతాల్లో పొగ తాగకుండా జాగ్రత్త వహించాలన్నారు. రాత్రి సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

టపాసు కేంద్రాల పరిశీలన

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ కేంద్రాలను బుధవారం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్యామరావు పరిశీలించారు. విక్రయ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరా తీశారు.

అగ్గిపెట్టెలు, లైటర్లతో రావొద్దు

ధర్మవరం అర్బన్: అగ్గిపెట్టెలు, లైటర్లు తీసుకువచ్చేవారికి టపాసుల కొనుగోలు కేంద్రాల వద్ద అనుమతి లేదని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ పట్టణంలోని క్రీడా మైదానంలో టపాసుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రజలు టపాసులు కొనుగోలు చేసేందుకు క్రీడా మైదానంలోకి వచ్చేవారు కాలేజి సర్కిల్‌లో రోడ్డుకు పక్కన ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసి టపాసులు కొనుగోలు చేసేందుకు వెళ్లాలన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతూ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ప్రభాకర్

తాడిమర్రి: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి దళితులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ దళితులపై అగ్రవర్ణాల వారు దాడి చేసినా, కులం పేరుతో దూషించినా, ప్రాణ, మానాలకు భంగం కలిగేలా ప్రవర్తించినా బాధితులకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ రక్షణ కవచంగా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు బండారు పెద్దఓబిలేసు, పోతలయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: మరికొమ్మదిన్నె పంచాయతీ నేరేడుచెరువు గ్రామంలోని ఆర్డీటీ స్కూల్‌లో బుధవారం తహసీల్దార్ నరేంద్రకుమార్ అధ్యక్షతన సివిల్ రైట్స్ డే నిర్వహించారు. కాలనీవాసులు మాట్లాడుతూ తమ కాలనీలో ఇళ్లులేని వారిని గుర్తించి పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. తహసీల్దార్ స్పందిస్తూ తమ సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జమేదార్ ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

ధర్మవరం రూరల్: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ ప్రజలకు సూచించారు. బుధవారం గొట్లూరు ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలపై ఎవరైనా దాడులు చేస్తే అలాంటి వారిపై అట్రాసిటి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సవరణ కేంద్రాలు ఏర్పాటు చేయండి

పుట్టపర్తి అర్బన్: అపార్ కార్డుల జారీలో అడ్డంకులను తొలగించడానికి ఆధార్ సవరణ కేంద్రాలను అన్ని ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని డీఈఓ కిష్టప్పను ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు వారు బుధవారం పుట్టపర్తి ఎమ్మార్సీలో డీఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు. వన్ నేషన్- వన్ స్టూడెంట్ పేరుతో దేశ వ్యాప్తంగా విద్యార్థులకు ఐడీ క్రియేట్ చేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. దీంతో జిల్లాలో అపార్ ఐడీ కార్డుల జారీకి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, అడ్మిషన్ నంబర్, యూడైస్‌లో ఒకేలా ఉన్నప్పుడే ఐడీ క్రియేట్ అవుతుందన్నారు. మెజారిటీ విద్యార్థులకు ఇవన్నీ సరిపోలడం లేదన్నారు. దీంతో సవరణ చేయడానికి ప్రతి ఉన్నత పాఠశాలలోనూ ఆధార్ సవరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తే అపార్ కార్డుల జారీ సులభతరమవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రామమోహన్, గోపాల్ నాయక్, బీఎస్ ప్రసాద్, ఆసిఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీప్రసాద్ సుధాకర్, కౌన్సిలర్లు ప్రసాద్, రవిచంద్ర, సంపత్‌కుమార్, వీర మహేశ్వర, సుకుమార్, శ్రీనివాసులు, కిష్టప్ప, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడుపుదాం

పుట్టపర్తి: బుక్కపట్నం మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన బుక్కపట్నం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ సిమెంట్ రోడ్లు, ఇతర అభివృద్ధి పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీలతారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ షాబుద్దీన్, వైస్ ఎంపీపీ ఆదినారాయణ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ లోకేశ్వరరెడ్డి

ఎన్‌పీకుంట: పంటలకు సేంద్రియ ఎరువులు వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని ఎదురుదొన, మేకలచెరువు రైతు సేవ కేంద్రాల పరిధిలో బుధవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని నూతన పద్ధతులను అవలంబిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో సాగుచేసిన వరి, వేరుశనగ, కంది పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ విష్ణుమూర్తి, వెటర్నరీ, రైతుసేవ కేంద్రం సిబ్బంది, జెడ్పీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.